అభ్యంతరాల స్వీకరణకు నేటితో గడువు పూర్తి

రాజమహేంద్రవరం : స్కూల్ అసిస్టెంట్స్ సాధారణ సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 9తో గడువు ముగుస్తుందని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కండి వాసుదేవరావు తెలిపారు. ఈ జాబితా కాకినాడ ఆర్‌జెడి వెబ్‌సైట్ www.rjdsekkd.org నందు మరియు సంబంధిత ఉమ్మడి తూర్పు గోదావరి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖల వెబ్‌సైట్లు, నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచామన్నారు. సీనియారిటీ జాబితాపై ఎవరైనా అభ్యంతరాలు కలిగి ఉంటే ఈ నెల 9వ తేదీలోపు సంబంధిత ఉమ్మడి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాల్సి ఉందన్నారు. అభ్యంతరం చేసే ఉపాధ్యాయుడి పూర్తి పేరు, పదవి, సంబంధిత వివరాలు, సీనియారిటీ జాబితాతో తప్పిదం ఎక్కడ ఉందో స్పష్టంగా పేర్కొనాలని, అందుకు సంబంధించిన ఆధారాలు లేదా సంబంధిత సాక్ష్యాలు జతచేయాలని తెలిపారు.

ఏడి పింఛన్

- కానరాని 50 ఏళ్లకే పెన్షన్ హామీ
- స్పౌజ్ పేరిట కొత్త మెలిక
- వితంతు పింఛను అర్థం మార్చేసిన సర్కారు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన 50 ఏళ్లకే పింఛన్ అందని ద్రాక్షలా మారింది. తాజాగా మంజూరు చేసిన వితంతు పింఛన్లలోనూ నిబంధనల మెలిక అడ్డుగోడలా మారడంతో కేవలం 1,140 మందికే పరిమితమైంది. జిల్లాలో మొత్తం 2,34,576 మందికి రూ.102 కోట్లు ప్రభుత్వం ప్రతినెలా పింఛనుగా మంజూరు చేస్తోంది. వృద్ధులు, 1,12,921 మంది, వితంతువులు 65,032 మంది, చేనేత కార్మికులు 1,276 మంది, మత్స్యకారులు 1,854 మంది, ఒంటరి మహిళలు 9,047 మంది, దివ్యాంగులు 32,073 మంది ఉన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల మంజూరు దాదాపుగా ఆటకెక్కింది. గడచిన ఏడాదిగా కొత్త పింఛన్లు ఇచ్చిన దాఖలాలు లేవు. అర్హులైన వారికి సకాలంలో పింఛన్లు మంజూరు చేసి వారి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాల్సిన కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. పింఛన్ల మంజూరును ఓ తంతుగా మార్చింది. గత నెల స్పౌజ్ కేటగిరిలో పింఛన్లు మంజూరు చేసిన విషయం విధితమే. ఏదైనా కేటగిరీలో పింఛన్ పొందుతూ భర్త మరణించిన భార్యకు స్పౌజ్ పేరుతో మంజూరు చేసింది. ఇలా 1,140 మందికి మాత్రమే పరిమితమైంది. ఎవరైనా వ్యక్తి ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పొందుతూ

డిసెంబరు 2023 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య చనిపోతే అతని భార్యను స్పౌజ్ కేటగిరిలో కింద అర్హురాలిగా గుర్తిస్తారు. అక్టోబరు తర్వాత భర్త మరణించిన మహిళకు పింఛన్ లేనట్లే. ఇది కూటమి ప్రభుత్వం వితంతు పింఛన్లకు విధించిన షరతు. ఇక సాధారణంగా ఎటువంటి సామాజిక పింఛన్ పొందని వారి కుటుంబాల్లో భర్త చనిపోయిన వారికి వితంతు పింఛన్ మంజూరు ఇప్పట్లో లేనట్లేనని ప్రభుత్వం చెప్పకనే చెప్పింది. అయితే ఈవిధంగా అర్హులైన వారు క్షేత్రస్థాయిలో మరో 3 వేల దరఖాస్తులు, ఇతర పింఛన్ల కోసం మరో 7 వేల దరఖాస్తులు మొత్తం కలిపి సుమారు 10 వేల మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

గత ఏడాదితో పోల్చితే కూటమి ప్రభుత్వంలో సుమారు 3వేల వరకూ పింఛన్లు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటికీ 50 ఏళ్ళు నిండిన వారు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. వారి నుంచి ప్రభుత్వం కనీసం దరఖాస్తులు కూడా తీసుకోవట్లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క సామాజిక పింఛన్ కూడా మంజూరు కాలేదు. పది నెలలుగా దరఖాస్తులు కూడా స్వీకరించలేదు. పైగా స్పౌజ్ కేటగిరీ పేరుతో నిబంధనలు విధించటంతో అర్హత కలిగిన వితంతువులు పిఛన్లు పొందలేని పరిస్థితి నెలకొంది. పింఛన్ల కోసం దరఖాస్తు చేసేందుకు వారం వారం అర్హులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ క్యూ కడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

నగరంలో పర్యటిస్తున్న బృందం

ఆర్‌సిఐతో మారనున్న నగరం ముఖచిత్రం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రివర్ సిటీస్ అలయెన్స్(ఆర్‌సిఐ) కార్యక్రమంతో రాజమహేంద్రవరం ముఖచిత్రమే మారిపోనుందని కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. కమిషనర్ సూచనల మేరకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ (ఎన్‌ఐయుఎ) బృందం గురువారం నగరంలో పర్యటించింది. రివర్ సిటీస్ అలయెన్స్ అనేది నదీతీరంలో ఉన్న నగరాలను అభివృద్ధి చేసే ఓ బృహత్తర కార్యక్రమమని కమిషనర్ తెలిపారు. దీనిని నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా, ఎన్‌ఐయుఎ సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. 2021 నవంబర్ 25న అప్పటి కేంద్ర జల శక్తి మంత్రి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు 146 నగరాలు సభ్యత్వ నగరాలుగా ఉన్నాయన్నారు. ఈ నగరాల అభివృద్ధికి ఎన్‌ఎంసిజి, ఎన్‌ఐయుఎ సంయుక్తంగా అర్బన్ రివర్ మేనేజ్ మెంట్ ప్లాన్‌కు రూపకల్పన చేశాయన్నారు. నగరాల్లోని నదీ పర్యావరణాన్ని తగిన రీతిలో స్థిరంగా నిర్వహిం చేందుకు కావాల్సిన సమగ్ర వ్యూహాలను యుఆర్ఎంపి అందజేస్తున్నారు. ఇప్పటికే కాన్పూర్, అయోధ్య, బరేలీ, మొరాదాబాద్, ఛత్రపతి సమ్భాజీ నగర్ వంటి నగరాలు ఎన్ఎంసిజి, ఎన్ఐయుఎ ఫ్రేమ్ వర్క్ సహాయంతో యుఆర్ఎంపి విజయవంతంగా అమలు పరుస్తున్నాయన్నారు. నగర పాలక, రెవెన్యూ, అటవీ, టూరిజం, రుడా, పిహెచ్ఇడి అధికారులతో కలిసి రెండు రోజుల పాటు ఈ బృందం నగరంలో పర్యటిస్తుందన్నారు. 15కి పైగా నదీ సంబంధిత ముఖ్య ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో కలిసి మల్టీ - స్టేక్ హోల్డర్ల సమావేశం కూడా నిర్వహించునున్నట్లు కమిషనర్ వెల్లడించారు. నదీ పర్యావరణాన్ని అభివృద్ధి పరిచేందుకు రాజమహేంద్రవరం ఎంతో అనువైనదిగా ఈ బృందం గుర్తించిందన్నారు. రానున్న రోజుల్లో అర్బన్ రివర్ మేనేజ్ మెంట్ ప్లాన్ ద్వారా రాజమహేంద్ర వరం మరింత సుందరంగా, ఆదర్శ నగరంగా మారుతుందనడంలో సందేహం లేదన్నారు.

అభివృద్ధి పనుల వేగం పెంచాలి : కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వేగాన్ని పెంచాలని కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులు, సిబ్బందికి సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఇంజినీరింగ్ విభాగ అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. నగర పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి ప్రగతిపై డివిజన్ల వారీగా ఆరా తీశారు. వివిధ దశల్లో ఉన్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్నారు. లెటర్ ఆఫ్ యాక్సప్టెన్స్ వచ్చిన వారం రోజుల్లో పనులను తప్పకుండా ప్రారంభించాలన్నారు. ఎక్కడైనా జాప్యం జరిగితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్క అధికారి తమ వద్దకు వచ్చిన ఫైల్‌ను 24 గంటల్లోగా క్లియర్ చేయాలన్నారు. పెండింగ్ అనేది ఎక్కడా ఉండకూడదన్నారు. పుష్కరాల నేపథ్యంలో

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కేతన్ గార్గ్

రానున్న రెండేళ్లు ఎంతో కీలకమని, కనుక ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఇ కోటేశ్వరరావు, ఇఇలు మదర్సా ఆలీ, మాధవి, రీటా, డిఇలు, ఎఇలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రెడ్ క్రాస్ డే వేడుకలు

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురంలో డాక్టర్ సత్యం రమేష్‌బాబు ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ భారతి, ఎస్ఐ రామ్‌కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ చైతన్య హాజరయ్యారు. అతిథులు రెడ్ క్రాస్ సంస్థ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యం రమేష్‌బాబు రెడ్‌క్రాస్ విశిష్టతను వివరించారు. తహశీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలు నిరుపమానమైనవన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, ఆరోగ్య సంక్షోభాలు ఎదురైనప్పుడు రెడ్ క్రాస్ సంస్థ ముందుండి సాయం అందించడడం అభినందనీయమన్నారు. ఎంపిడిఒ భారతి మాట్లాడుతూ సమాజంలో బలహీన వర్గాల వారికి రెడ్ క్రాస్ అందిస్తున్న చేయూత మరువలేనిదన్నారు. ఎస్ఐ రామ్‌కుమార్ మాట్లాడుతూ రక్తదానం వంటి కార్యక్రమాలను నిర్వహించడంలో రెడ్‌క్రాస్ చేస్తున్న కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో రెడ్ క్రాస్ అందిస్తున్న సాయం వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, రెడ్ క్రాస్ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కలెక్టర్ ప్రశాంతికి రెడ్‌క్రాస్ ప్రశంసాపత్రం

రాజమహేంద్రవరం రూరల్ : ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రాజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులు మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. 2022-23 సంవత్సరంలో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాలు విస్తత స్థాయిలో ప్రచారం కల్పించడం కోసం చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో రెడ్ క్రాస్ కార్యక్రమాలను చేపట్టడం, సభ్యత్వ నమోదు విషయం ప్రత్యేకంగా దృష్టి పెట్టామన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు పెద్ద ఎత్తున చేపట్టడం ద్వారా మరింత సమర్థవంతంగా కార్యక్రమాలను నిర్వహించడం సాధ్యమవుతుందన్నారు.

సాయం అందిస్తున్న ఎంఎల్‌ఎ వాసు

అభాగ్యులకు అండగా ఉంటా

ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అభాగ్యులకు అండగా ఉంటానని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కేన్సర్‌తో బాధపడుతున్న 42వ డివిజన్ రత్నంపేట వాంబే గృహాలకు చెందిన దొండపాటి జ్యోతి అనే మహిళకు ఇంజక్షన్ కొనుగోలు నిమిత్తం భవానీ ఛారిటబుల్ ట్రస్టు తరపున రూ.20వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్టు తరపున నిత్యం ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జ్యోతికి మెరుగైన ఆరోగ్యం కోసం భవిష్యత్తులోనూ తన వంతు సాయం అందిస్తానన్నారు. ఆరోగ్యకర సమాజం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమన్నారు. అందుకే ఎన్‌టిఆర్ వైద్య సేవల ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ల వెంకటరాజు, కెవి.శ్రీనివాస్, పేరూరి అంజి, బొమ్మనమైన శ్రీను, బాలు, రత్నంపేట చిన్ని తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా అప్రమత్తం

మాక్ డ్రిల్‌తో అవగాహన

పాల్గొన్న రెవెన్యూ,ఫైర్,పోలీసు సిబ్బంది

ప్రజాశక్తి - యంత్రాంగం

భారత్, పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రమాదల నుంచి కాపాడుకునేందుకు జిల్లాలో పలుచోట్ల మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారులు, పోలీసులు, ఫైర్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ మాక్‌డ్రిల్స్ సాగాయి.

రాజమహేంద్రవరం : కేంద్ర హోం శాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గురువారం జిల్లా అంతటా మాక్ డ్రిల్ నిర్వహించారు. జిల్లా అడిషనల్ ఎస్‌పి(లా అండ్ ఆర్డర్) అల్లూరి వెంకటసుబ్బరాజు సూచనల మేరకు సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు దాడులు జరిగితే అత్యవసర సమయంలో పౌరులు స్వీయ రక్షణ, ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లాలోని ఎయిర్ పోర్ట్, రైల్వే స్టేషన్స్, బస్టాండ్‌ల వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు, వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైరన్లు మోగినప్పుడు తక్షణమే ఏమి చేయాలి? ఏ విధంగా స్వీయ రక్షణ పొందాలి? ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలి, రక్షణ దళాలు రక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే విషయాలపై స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫైర్, హెల్త్ సిబ్బంది మాక్‌డ్రిల్ ద్వారా చూపించారు. ఉగ్రవాదులను, శత్రవు మూకలని ఏ విధంగా హతమార్చాలనే అంశాలను సివిల్ మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

కోరుకొండ : బస్టాండ్ సెంటర్‌లో గురువారం సాయంత్రం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటువంటి వాతావరణంలో అయినా ప్రజలు తీసుకోవలసిన చర్యలపై వివరించారు. అగ్నిమాపక శాఖ అధికారులు ప్రజలను భాగస్వామ్యం చేసి విన్యాసాలు చేసి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీస్, రెవెన్యూ, ఫైర్ శాఖల అధికారుల ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ రాణి సుస్మిత మాట్లాడారు. యుద్ధ హెచ్చరికల మేరకు ఎటువంటి ప్రమాదాలనైనా ఎదుర్కొనేందుకు మాక్ డ్రిల్ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. డివిజన్ స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. కొవ్వూరు డివిజన్‌లో ప్రజలకు ప్రమాదాలు జరిగినప్పుడు వైద్య సేవలు అందించేందుకు 26 ఆసుపత్రులు, 48 మంది వైద్యాధికారులు, 150 మంది నర్సులు, 10 అంబులెన్సులు సిద్ధంగా ఉంటాయని తెలిపారు. యుద్ధ పరిస్థితులు సమయంలో ఎలా స్పందించాలి, ఎటువంటి ఇబ్బందులూ లేకుండా, ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంపై అవగాహన కల్పించడం ఈ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ప్రమాదాల సమయంలో సైరన్ మోగిస్తామని, ఆ సమయంలో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, డిప్యూటీ డిఎంహెచ్ఒ జె.సంధ్య, సిఐ పి.విశ్వం, తహశీల్దార్ దుర్గాప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

దేవరపల్లి : బస్టాండ్ సెంటర్లో రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎస్ఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఏదైనా దాడి జరిగినప్పుడు దాని నుంచి ఎలా తప్పించుకోవాలి? ఎలా ప్రతిగటించాలి? అనేదానిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రద్దీగా ఉండే ప్రదేశాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే తెలియజేయాలన్నారు. బ్యాగులు, టిఫిన్ బాక్సులు గుర్తింపు లేని వాహనాలు అనుమానంగా ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తహశీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

చాగల్లు : చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సివిల్ మార్క్ డ్రిల్ నిర్వహించారు. అనుకోని రీతిలో ఉగ్రదాడులు జరిగిన బాంబులు పేలిన అగ్ని ప్రమాదల సంభవించిన ఎలా వ్యవహరించాలని అంశాలపై ప్రజలకు అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి మాట్లాడారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. యుద్ధం వచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లపూడి : బస్టాండ్ సెంటర్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. యుద్ధ సమయంలో తీసుకోవాల్సిన చర్యలను, జాగ్రత్తలను వివరించారు. రాత్రి సమయాల్లో వీలైనంతవరకు గహాల్లో లైట్లు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ భారతి, ఎస్ఐ రామకృష్ణ, ఎంపిడిఒ రమణ తదితరులు పాల్గొన్నారు.

పెరవలి : తహశీల్దార్ డి.అచ్యుతకుమారి, ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పెరవలి సెంటర్ లో మానవహారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంటి వద్దే సురక్షితంగా ఉండాలన్నారు.

గాయపడిన వ్యక్తిని తరలిస్తున్న ఫైర్ సిబ్బంది

తాళ్లపూడిలో...

రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టులో....

కోరుకొండలో...

ప్రాథమిక చికిత్స చేస్తున్న వైద్యురాలు

కార్టూ'నిజం'



మాజీ సిఎం జగన్‌ను కలిసిన ఏడుకొండలు

ప్రజాశక్తి-గోకవరం

తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని వైసిపి ఎస్‌సి సెల్ ఉభయగోదావరి జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి, జగ్గంపేట నియోజకవర్గ లీగల్ అడ్వయిజర్ గుల్లా ఏడుకొండలు గురువారం కలిశారు. సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం బనాయిస్తున్న అక్రమ కేసులు, అరెస్టుల గురించి జగన్‌కు వివరించారు. అక్రమ కేసులకు భయపడితే కూటమి ప్రభుత్వ అక్రమాలను బయట పెట్టలేమని, తెగువతో ముందుకు వెళ్తున్న సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ అండగా నిలబడుతుందని, వారికి అన్ని విధాల న్యాయ సహాయం అందించాలని, నియోజకవర్గ సమన్వయకర్తలతో కలిసి పార్టీ కార్యకర్తలను కాపాడుకోవాలని జగన్ సూచించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. సంక్షేమం అందించిన వైసిపి ప్రభుత్వానికి విధ్వంసం సష్టిస్తున్న కూటమి ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు అతికొద్ది కాలంలోనే తెలుసుకున్నారని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారన్నారు. రానున్న రోజుల్లో మరింత ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని జగన్ సూచించారని గుల్లా ఏడుకొండలు తెలిపారు.

ధనరాజు కుటుంబానికి శేషారావు పరామర్శ

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణం 23వ వార్డు లింగంపల్లిలో ఇటీవల కొమ్మిన ధనరాజు మతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను గురువారం టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. ధనరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టిడిపి పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ తదితరులున్నారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి గ్రామపంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపిపి కుప్పాల దుర్గారావు, ఎంపిడిఒ వేణుగోపాల్‌రెడ్డి సందర్శించారు. తడి, పొడి చెత్తలను వర్మీ కంపోస్టుగా తయారు చేయడాన్ని పరిశీలించారు. అనంతరం సర్పంచ్ కడిమి వీరకుమారితో కలిసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద 20 రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్.రవికిషోర్, ఎస్‌కె.సమీనాబేగం, కడిమి రాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

నేడు కలెక్టరేట్ వద్ద ఎపిటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - తాళ్లపూడి

అపరిష్కతంగా ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 9న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, దీన్ని జయప్రదం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు ఉపాధ్యాయులను కోరారు. గురువారం మండలంలోని ప్రక్కిలంక పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 117 జిఒను రద్దు చేస్తానన్న ప్రభుత్వం, ఇప్పుడు 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడం తగదన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు కరువు భత్యాలతో పాటు మిగిలిన ఆర్థికపరమైన ఇబ్బందులను కూడా తొలగించి ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సలీం, జిల్లా కార్యదర్శి సనపల రాజశేఖర్, మండల కార్యదర్శులు రఘువీరశాస్త్రి, శోభన్‌బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు..

మెరిట్ విద్యార్థులకు అస్సాగో ప్రోత్సాహం

ప్రజాశక్తి-గోకవరం

2024-25 విద్యా సంవత్సరంలో గుమ్మలదొడ్డి హై స్కూల్లో ప్రతిభ కనబర్చిన పదో తరగతి విద్యార్థులకు అస్సాగో యాజమాన్యం ప్రోత్సాహకాలను అందించింది. చుట్టుపక్కల నాలుగు గ్రామాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు అస్సాగో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశిష్ గుర్నానీ చేతులు మీదుగా నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారి ఆశయాలను తెలుసుకున్నారు. మంచి భవిష్యత్తు కోసం ఉన్నత విద్యను కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లి తండ్రులు మాట్లాడుతూ అస్సగో కంపెనీ వారు ఇచ్చిన ఈ ప్రోత్సాహం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అస్సాగో ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్, వికె.శుక్లా, జిఎం(హెచ్ ఆర్) చంద్రశేఖర్, ఎఎస్ఒ భవానీశంకర్, హెచ్ఎం లక్ష్మీకాంతం, ఎస్ఎంసి ఛైర్మన్ సురేష్ బాబు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బహుమతులు అందిస్తున్న ఆశిష్‌గుర్నాని

సరిపడా ఇసుక నిల్వలు ఉండాలి

ప్రజాశక్తి - అమలాపురం

వర్షాకాలంలో భవన నిర్మాణ రంగ కార్మికులు ఉపాధికి, నిర్మాణరంగం నిర్విఘ్నంగా కొనసాగేందుకు అవసరమైన ఇసుకను సమృద్ధిగా నిల్వలు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ రెవెన్యూ భూగర్భ గనుల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిధిలోని కామనగరువు ఆమని ఆటోమొబైల్స్ సమీపంలోని ఇసుక స్టాక్ యార్డ్‌ను, రావులపాలెం మండలం రావులపాడు కూరేటి వారి చెరువు వద్ద, ఇసుక స్టాక్ యార్డ్, జొన్నాడ జాతీయ రహదారి పక్కన ఉన్న ఇసుక స్టాక్ యార్డ్‌ను అధికారులతో కలసికలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో భవన నిర్మాణ రంగాన్ని కార్మికుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అవసరమైన ఇసుకను నిల్వలు ఉంచాలని సూచించారు. స్టాక్ యార్డు నందు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు స్పష్టంగా ఉండాలన్నారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయా లు ఉండకూడదన్నారు. వర్షపు నీరు నిలిచిపోకుండా డ్రెయినేజీ వ్యవస్థ ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించడంతోపాటు పర్యావరణానికి హాని కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక తరలింపులో వాహనాలపై రహదారి భద్రత దృష్ట్యా టార్పాలిన్ కప్పాలన్నారు. సిసి కెమెరాలు నిఘాలో ఇసుక కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. వాహనాలకు తప్పని సరిగా జిపిఎస్ ట్రాకింగ్ విధానం ఉండాలన్నారు. ఇసుక ఆన్లైన్ ఆఫ్లైన్ బుకింగ్ రవాణా రికార్డుల నిర్వహణ అంశాలను అత్యంత పారదర్శకంగా చేపట్టా లన్నారు. ఖర్చు లు తగ్గిస్తూ సామర్థ్యాల ను పెంచాలని అధికారుల కు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.మాధవి, పి.శ్రీకర్, జిల్లా భూగర్భ గనుల శాఖ సహాయ సంచాలకులు ఎల్.వంశీధర్ రెడ్డి, తహశీల్దార్లు అశోక్ కుమార్, ముక్తేశ్వరరావు, సర్వేయర్ శివ తదిత రులు పాల్గొన్నారు. **రావులపాలెం:** మండలంలో రావులపాడు పూరేటి వారి చెరువు ఇసుక స్టాక్ యార్డులను అధికారులతో కలసి గురువారం కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో భవన నిర్మాణ రంగాన్ని, కార్మికుల భవిష్యత్తును దష్టిలో ఉంచుకొని అవసరమైన ఇసుకను నిల్వలు ఉంచాలని సూచించారు. ఇసుక ఆన్లైన్, ఆఫ్ లైన్ బుకింగ్, రవాణా రికార్డుల నిర్వహణ అంశాలను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, జిల్లా భూగర్భ గనుల శాఖ సహాయ సంచాలకులు ఎల్. వంశీధర్ రెడ్డి, తహశీల్దార్ బి యం ముక్తేశ్వరరావు,ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం మండలం రావులపాడులో స్టాక్ యార్డు పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

నేరాలు ఘోరాలు

చిన్నారి మృతి ఘటనపై దర్యాప్తు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో కలకలం రేపిన ఐదు నెలల పసికందు మృతి ఘటనపై దర్యాప్తు కొనసాగుతుందని సిఐ జి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదు నెలల పసికందు అయిన తన మనవరాలు కనిపించడం లేదని పాప తాత దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదుపై సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించడం జరిగిందన్నారు. ఎఎస్‌పి మనీష్ దేవరాజ్‌పాటిల్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారన్నారు. నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపడుతున్నామని, సాంకేతికతను ఉపయోగించి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ని రంగంలోకి దించి పలు ఆధారాలు సేకరించడం జరిగిందన్నారు. అక్కడ క్షుద్ర పూజలు జరిగినట్టుగా చెప్పబడుతున్న దానిలో వాస్తవం లేదని, కేవలం జరిగినటువంటి సంఘటనను కప్పిపుచ్చేందుకు క్షుద్ర పూజలు సీన్ క్రియేట్ చేసినట్టుగా తమ దర్యాప్తులో ప్రాథమికంగా తేలిందన్నారు. పాప మృతిని హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. త్వరలోనే అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

గోదావరిలో దూకిన యువకుని గల్లంతు

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి బ్రిడ్జి పైనుంచి గోదావరిలోకి దూకి యువకుడు గల్లంతయిన సంఘటన గురువారం ఉదయం జరిగింది. అమలాపురం మండలం కామనగరువుకు చెందిన కామన భార్గవ్ గా (21)గుర్తించారు. గల్లంతయినాడు భార్గవను రక్షిరేందుకు గోదావరిలోకి దూకిన అన్న రాజేష్ ప్రమాదంలో చిక్కుకున్నాడు. బ్రిడ్జి పైనుంచి లారీ డ్రైవర్ పగ్గము అందించడం తో స్థానిక మత్స్యకారులు రాజేష్‌ను కాపాడి ఒడ్డుకు చేర్చారు. బైకుపై అన్నదమ్ములిద్దరూ వచ్చారని సానికులు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని తిరుగుడు మెట్ట గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంలపై పోలీసులు గురువారం దాడి చేశారు. పేకాడుతున్న పది మందిని అరెస్టు చేశామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.7,130 నగదును స్వాధీనం చేసుకున్నా మన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చెందుర్తిలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి ఎస్‌సి పేటలో గురువారం అగ్ని పమాదం చోటుచేసుకుంది . ఈ ప్రమాదంలో అయినవిల్లి నానికి చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధం అయింది. సమయానికి ఫైర్ సిబ్బంది రాకపోవడంతో స్థానికులు మంటలను అదుపు చేశారు. ఇంటిలో అన్నీ సామాన్లు దగ్ధం అయ్యాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

అంబాజీపేట పిహెచ్‌సి రివ్యూ సమీక్షలో మాట్లాడుతున్న డిపిఎమ్‌ఒ శ్రీనివాసరావు

పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

గైడు లెన్స్‌లో ఉన్న పారా మిట్ రీస్ ఎప్పటికప్పుడు ఎన్‌సిడి-సిడి, ఆర్ బిఎస్‌కె, పిఎమ్ఎస్ ఎమ్ఎ, పిఎమ్‌వివై, ఎబిహెచ్ఎఐడి, పిఎమ్ జెవై అన్ని ప్రభుత్వ పథకాలను కూడా ప్రజలకు చేరువయ్యేలా ఉండేటట్లు వైద్య సిబ్బంది అందరూ కషి చేయాలని డిపిఎమ్ఒ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. అంబాజీపేట పిహెచ్ సి నందు గురువారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పిహెచ్ సి డెవలపర్స్, ఆర్ సి హెచ్ రిజిస్ట్రేషన్ 98 శాతం ఉండేటట్లు ఏఎన్ సిపిఎన్ కేసులు ప్రణాళికా పరంగా డోర్ టు డోర్ తిరిగి పరిశీలనలో అర్హులను గుర్తిస్తూ ఒకే సర్వేలో డిసీజెస్ గుర్తించి ఎన్ వి బి,డిసిబి గుర్తించి మాత మరణాలు,శిశుమరణాలు తగ్గించాలి 0-5 సంవత్సరాల పిల్లలకు డ్రాప్ట్ అవుట్ లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కె.ఎన్.శ్రీనివాస్, సూర్యతేజ, అంబాజీపేట, ముక్కామల పిహెచ్‌సి ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్యం కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు వేలం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మద్యం తరలిస్తూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌ఛార్జ్ సిఐ రవితేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎక్సజ్ కార్యాలయంలో కాకినాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సజ్ సూపరింటెండెంట్ సమక్షంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తారన్నారు.. ఈ వేలంలో 8 వాహనాలకు వేలం నిర్వహిస్తున్నమన్నారు. వేలంలో పాల్గొను వారు ముందుగా రూ.2 వేలు ధరావత్తు చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. ఈ వాహనాలకు అమలాపురం ఆర్‌టిఒ అధికారులు నిర్ణయించిన అప్‌సెట్ ధరపై కొంత మేర పెంచి వేలం నిర్వహిస్తారన్నారు. వేలంలో పాడుకున్న కొనుగోలు దారుడు జిఎస్‌టి 18 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుందని ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌ఛార్జ్ సిఐ రవితేజ అన్నారు.

ఎజిపిగా సిదార్థకుమార్ నియామకం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సిద్ధార్థకుమార్

ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎజిపిగా కాశి సిద్ధార్థకుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో గురువారం మాట్లాడుతూ ఎజిపి తనను నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు. ముమ్మిడివరం జూనియర్ సివిల్ కోర్టులో అడ్వకేట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వం తనను ఎజిపిగా నియమించిందన్నారు. తన నియామకానికి సహకరించిన ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజుకు సిద్ధార్థకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఎల్ఎకు స్వాగతం పలుకుతున్న శివాజీ, మూర్తి

ఉమా పార్వతీ నర్సరీలో తెలంగాణ ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కడియం

మండలంలోని బుర్రిలంక ఉమా పార్వతి నర్సరీని తెలంగాణ ఎంఎల్ఎ పెద్ది సుదర్శన్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి సోదరులు శివాజీ, మూర్తి టాల్ బోన్సాయ్ నర్సరీలో 100 సంవత్సరాల వయసు ఉన్న మొక్కలను ఆయనకు చూపించారు. వీటి కోసం ఆయన అడిగి తెలుసుకున్నారు. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి, పర్యావరణానికి కడియం నర్సరీ రైతుల చేస్తున్న సేవలు చాలా విలువైనవన్నారు. నర్సరీకి చేరుకున్న ఎంఎల్ఎ సుదర్శనరెడ్డికి కొత్తపల్లి సోదరులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముత్యం జగదీష్, అలంపల్లి శ్రీను, స్థానిక నర్సరీ రైతులు ఉన్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరం

ప్రజాశక్తి - చాగల్లు

చంద్రవరం శాఖా గ్రంథంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం ఉత్సాహంగా సాగుతుంది. గురువారం విద్యార్థులతో పలు కథల పుస్తకాలను చదివించామని గ్రంథాలయ అధికారి కె.సుమన్‌కుమార్ తెలిపారు. అనంతరం వేమన పద్యాలు, సుమతీ సతకాలు, భగవద్గీత శ్లోకాలను ఎంపియుపి స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ఆర్.రమంబా చదవించి, వాటి అర్థాలను వివరించారు. సమ్మర్ క్యాంపును ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులకు పద్యాల పోటీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నెక్కంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేతలతో సంఘీభావం తెలుపుతున్న సంఘ జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

'సమస్యలపై పోరాటానికి అండగా ఉంటా'

ప్రజాశక్తి - ఆలమూరు

బీసీల సమస్యలపై పోరాడటానికి అండగా ఉంటానని ఆలిండియా బిసి ప్రజా వెల్ఫేర్ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గుమ్మిలేరులోని సీతారామ ఫంక్షన్ హాల్ నందు గురువారం జరిగిన బిసి కులాల సమావేశం కొత్తపేట నియోజక వర్గ అధ్యక్షులు బొక్క భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గూడూరి మాట్లాడుతూ బిసిలందరికీ ఏ విధమైన సహాయ సహకారాలు కావలసిన నా వంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఎంతటి సమస్యలైనా ఎదుర్కొనేందుకు నేను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నేను ఢిల్లీలో ఉన్న మీ సమస్యను తీర్చేందుకు వెంటనే స్పందించి కార్యక్రమాన్ని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరు నిజాయితీగా, నిర్భయంగా మీ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి ఒక్కరు కలిసికట్టుగా ఉంటూ యువతకు మార్గం చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం కొత్తపేట నియోజక వర్గ స్థాయి నూతన కమిటీ సభ్యులు గెద్దాడ దేవి శ్రీనివాస్, గుత్తుల మురళి, గెద్దాడ శ్రీనివాస్, గుబ్బల గోపి, బొక్క వెంకటేష్, కుడుపూడి రమేష్, నీల నాగార్జున, సారిక గురుమూర్తి, టేకి వెంకన్న, లోల్ల జనార్ధన్ స్వామి, విన్నకోట వీరబ్రహ్మం, మండ సాయిదుర్గలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నేతలు అయినవల్లి సత్తిబాబు గౌడ్, మట్టపర్తి సూర్యచంద్రరావు, గుత్తుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య సంఘాల రిటర్న్స్ దాఖలు చేయాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా పరస్పర సహకార సంఘాల ఆడిట్ రిటర్న్స్ గడువు లోపల దాఖలు చేయాలని జిల్లా సమాఖ్య అకౌంటెంట్ అధికారి గురువారం ఒక ప్రకటన లో కోరారు. డాక్టర్ బి ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఉన్న మండల మహిళా సమాఖ్య, మత్స్యకార మహిళా సమాఖ్య, గ్రామ మహిళా సంఘాలు, రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహకార సంఘాలుగా రిజిస్టర్ కాబడిన సంఘాలు, గత ఆర్థిక సంవత్సరం నకు సంబంధించిన ఆడిట్ రిటర్న్స్‌ను సెర్ప్ విజయవాడ వారి ఆదేశాల మేరకు నిర్దేశించిన ప్రపోజల్స్ ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల లోని జిల్లా కార్యాలయాల ప్రాం గణంలో మొదటి అంతస్తు రూమ్ నెంబర్ 103 లోగల సంబంధిత అధికారికి, ఈ నెల 12 లోపు సమర్పించాలని కోరారు.

ఘనంగా మూలారెడ్డి జయంతి

ప్రజాశక్తి - బిక్కవోలు

మాజీ ఎంఎల్ఎ నల్లమిల్లి మూలారెడ్డి జయంతిని స్థానిక ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం పందలపాక గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ రామకృష్ణారెడ్డి మూలారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వద్ధులకు మహిళలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత్రికేయులపై ప్రభుత్వ చర్యలు అమానుషం

ప్రజాశక్తి - రామచంద్రపురం

జర్నలిస్టులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవటం అమానుషం అని రామచంద్రపురం నియోజకవర్గ ప్రెస్ క్లబ్ జర్నలిస్టు సంఘాల నేతలు అన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డికి నోటీసులు ఇవ్వకుండా ఇంటిపై పోలీసులు దాడి చేయటాన్ని వీరు తీవ్రంగా ఖండించారు. ఈమేరకు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో గురువారం ఆర్‌డిఒ డి.అఖిలకు వినతి పత్రాన్ని సమర్పించారు.

వంద రోజుల పని కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - కాజులూరు

ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పించడం లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని ఎపిఒ కెవి.వెంకటలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని నామవానిపాలెం, పల్లిపాలెం గ్రామాల్లో ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని చేస్తానని ముందుకు వచ్చిన ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా పని కల్పించడం జరుగుతుందని తెలిపారు నిర్దేశించిన పనిని సకాలంలో పూర్తి చేసినట్లయితే ప్రతి ఉపాధి కూలీకి రూ.307 కూలిగా చెల్లించడం జరుగుతుందన్నారు. మండలంలో 26 గ్రామాల్లో ప్రతిరోజు 2500 మందికి ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఉపాధి కూలీలు జీవన్ జ్యోతి, జీవన సురక్ష బీమా యోజనలో బీమా చేసుకుంటే ప్రమాదవశాత్తు మరణం సంబంధించినప్పుడు రూ.2 లక్షలు కూలీ కుటుంబానికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా నిర్దేశించిన పనిని ఉదయం 6 గంటల నుంచి 11 గంటల లోపు పూర్తిచేసుకున్నట్లయితే ఎండ దెబ్బ తగలకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తిరుపతిరావు, ప్రసాద్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బీమా చేయించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో 70 సంవత్సరాల లోపు వయసు కలిగిన 15 వేల మంది ఉపాధి కూలీలకు బీమా చేయించాలని ఎంపిడిఒ డి.శ్రీలలిత అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులు, సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటివరకు 4600 మందికి మాత్రమే బీమా పూర్తి చేశారన్నారు.ఉపాధి హామీ చట్టంలో మంజూరైన 84 పొలాల్లో ఇంకుడు గుంతలలో ఇప్పటివరకు 35 మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన వాటినివేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

ఇంటర్మీడియేట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసర మైన చర్యలు తీసుకోవాలని డిఆర్‌ఒ జె.వెంకట్రావు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం ఇంటర్మీడియేట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం డిఆర్‌ఒ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకూ ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని, ఈ పరీక్షలకు మొత్తం 21,541 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. వీరిలో 15,933 మంది మొదటి సంవత్సర పరీక్షకు, 5,608 మంది రెండవ సంవత్సర పరీక్షలకు హాజరౌతా రన్నారు. జిల్లాలో మొత్తం 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొదటి సంవత్సర పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, రెండవ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకూ సిసి కెమేరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. ఇంటర్మీడియేట్ విద్యాధికారి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షా పత్రాలు, సామాగ్రి ఉంచిన స్ట్రాంగ్ రూమ్, మెటీరియల్ పంపిణీ, తిరిగి సేకరణ చేసే డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు, పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆయన ఆదేశించారు. పరీక్షల తేదీలలో అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేయాలని, వాటి సమీపంలోని జెరాక్స్ కేంద్రాలను పరిక్షల సమయంలో మూసివేయించాలని తహశీల్దార్లను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేందుకు తగిన బస్సు సర్వీసులు నడపాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. పరీక్షల సమయంలో అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియేట్ విద్యాధికారి ఐ.శారద, డిపిఒ వి.రవికుమార్, జిల్లా పరీక్షా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో గడిగట్ల సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సిఐటియు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సార్వత్రిక సమ్మెపై ప్రచురించిన బుక్ లెట్ ను కార్మిక సంఘ నేతలు ఆవిష్కరించారు. అనంతరం రాజ్‌కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక వర్గం అనేగా సమస్యలతో సతమతమవుతుందన్నారు. వేతనాలు పెరగక కార్మిక కుటుంబాలు అవస్థలు పడుతున్నాయన్నారు. కార్మికులను ఆదుకోవలసిన పాలకవర్గాలు వారి హక్కులను హరిస్తున్నాయని అన్నారు. కార్మిక హక్కుల కోసం ఈనెల 20న తలపెట్టిన ఈ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు సిఐటియు ఆధ్వర్యంలోని కార్మిక సంఘాలు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు దాడి బేబీ, మాగాపు నాగు, గూనూరు వెంకటరమణ, తాడిశెట్టి గంగ, డి. క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపాలిటీలోని వివిధ విభాగాల్లో పనిచేసే ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె గురు వారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకర నాగేశ్వరరావు, కోనాల వెంకటరమణ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగాల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మి కులుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమకు ఉద్యోగ భద్రత లేదని, వేతనాలు పెంచడం లేదని, అనేక సమస్యలతో అవస్థలు పడుతున్నామన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వివిధ రూపాల్లో అభ్యర్థనలు, నిరసనలు తెలిపినా ప్రభుత్వం స్పందించనందున నిరవధిక సమ్మె చేపట్టామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి ఇనుమర్తి శ్రీనివాస అయ్యప్పస్వామి, సంఘ కమిటీ సభ్యులు సుంకర సత్తిరాజు, నామా సూర్యప్రకాశరావు, పూల ప్రశాంత్, మహపాతిన పాపారావు, భాస్కరరావు పాల్గొన్నారు.

'చిలుకూరి'కి జైళ్ల శాఖ డిజి అభినందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జైళ్ల శాఖ డిజి అనిల్‌కుమార్ అభినందించారు. ఆయన రాజమండ్రి సెంట్రల్ జైలును గురువారం సందర్శించారు. దీనిలో భాగంగా జైల్లో ఖైదీలకు నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ పాఠశాలను సందర్శించారు. రెండేళ్లగా ఉపాధ్యాయులు ఖైదీలకు మంచి శిక్షణ అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని జైలు సూపెరెంటిండెంట్ ఎస్.రాహుల్ డిజికి తెలిపారు. ఈ సందర్భంగా డిజి అనిల్‌కుమార్ ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు, ఎంఎస్ఎస్ఎస్.శర్మలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ డిఐజి రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు చిలుకూరితో డిజి అనిల్‌కుమార్ తదితరులు

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి సూచించారు. గురువారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఎస్ఎస్ గ్రాండ్ ఇన్' అతిథి గృహ సముదాయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో యువత స్వయం ఉపాధిని సాధించాలని అన్నారు. ఇలా స్వయం ఉపాధిని పొంది మరి కొందరికి ఉపాధి అవకాశాన్ని కల్పించిన యజమాని అశోక్ కృషిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కూటమి నాయకులు బిక్కిన విశ్వేశ్వరరావు, డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కంటే జగదీశ్ మోహన్, గోలి దొరబాబు, సరోజ వాసు, పిట్టా జానకిరామారావు, పెంకే వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కాలుష్యంపై అధికారుల బృందం విచారణ

ప్రజాశక్తి - పెద్దాపురం

తూర్పుపాకల గ్రామంలో కోళ్ల ఫారం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు చేసిన ఫిర్యాదుపై గురువారం పంచాయతీరాజ్, పరిశ్రమల శాఖ, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బృందం విచారణ చేపట్టింది. గ్రామంలో ఉన్న కోళ్ల ఫారాన్ని, పరిసరాలను పరిశీలించింది. స్థానికులను కలుసుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ డి.శ్రీలలిత మాట్లాడుతూ కాలుష్యంపై చేపట్టిన విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ పర్యటనలో పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్, డాక్టర్ చంద్రకిరణ్, ఇఒపిఆర్‌డి త్సలికి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 4వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 150/2021

Between:

Syndicate Bank, a body Corporate consituted under the Banking Companies (Acquisition and transfer of undertakings) Act, 1970 having its head office at Manipal, Karnataka State, Innispeta Branch, Rajamahendravaram, represented by its Chief Manager and GPA holder V.R.S.Sarma. ***...Plaintiff***

AND

Sri Miriyala Syam Prasad and Others ***...Defendants***

D-1: Sri Miriyala Syam Prasad, S/o. Appa Rao, Hindu, aged 36 years, A Block, Satellite City, Main Road, Rajamahendravaram ***...1st Defendant***

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 12-5-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.ఎస్.ఎస్.మురళీమోహన్

రాజమండ్రి **జి.వి.రామలక్ష్మి**

02-5-2025 అడ్వకేట్స్, రాజమండ్రి

వ్యవసాయాన్ని లాభదాయకం చేసేందుకు కృషి

ఎంఎల్ఎ పంతం నానాజీ

ప్రజాశక్తి - కరప

వ్యవసాయాన్ని లాభదాయకం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ పంతం నానాజీ అన్నారు. గురువారం మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. కొత్తగా మంజూరైన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక హైస్కూల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 37 మంది రైతులకు దమ్ము ట్రాక్టర్స్, డ్రోన్లు, దమ్ము బ్లేడ్స్, బ్యాటరీ స్ప్రేయర్స్ 50 శాతం రాయితీపై అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి, కాపు, ఇడబ్ల్యుఎస్ కార్పొరేషన్ ద్వారా 319 యూనిట్స్‌కు రూ.8.15 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో రూ.28.79 కోట్లతో నియోజకవర్గంలో 270 పనులు చేపట్టామన్నారు. మరో రూ.13 కోట్లు విలువ చేసే పనులకు ప్రతిపాదనను సిద్ధం చేయడం జరిగిందన్నారు. త్వరలోనే మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, నున్న గణేష్‌నాయుడు, ముద్రగడ రమేష్, యాళ్ళ పండు, బండారు, మురళి, నీటి సంఘం అధ్యక్షులు పుణ్యమంతుల సత్యనారాయణ, ఎంపిడిఒ ఎం.అనుపమ, తాహశీల్దార్ పి.సత్యనారాయణ, ఎడిఎ బాబురావు, ఎఒ రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

తూర్పుగోదావరి జిల్లా, పెరవలి మండలం, తీపర్రు గ్రామానికి చెందిన నందమూరి జానకి రాముడు కు చెందిన పాస్‌పోర్ట్ నెంబర్ **F9750553,** తీసుకుని జిరాక్స్ నిమిత్తం సెంటర్‌కు వెళ్తుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అడ్రస్:

నందమూరి జానకి రాముడు

S/o. సత్యనారాయణ, డో.నెం. 1-80, తీపర్రు గ్రామం, పెరవలి మండలం తూర్పుగోదావరి జిల్లా

పిన్-534331, సెల్: 9866228173

రోడ్డును పరిశీలించిన తహశీలార్

ప్రజాశక్తి- గోకవరం

మండల కేంద్రమైన గోకవరం ఎరుకల దిబ్బ వద్ద రైతులు పొలంలోకి వెళ్లే దారిలో మండల పరిషత్ నిధులు రూ.15 లక్షలతో చేపట్టిన గ్రావెల్ రోడ్డును తహశీల్దార్ సాయిప్రసాద్ గురువారం పరిశీలించారు.కొన్ని కారణాలవల్ల ఈ పనులు నిలిచిపోయాయి. దీంతో తహశీల్దార్ సాయిప్రసాద్‌ని వైసిపి నాయకులు సుంకర వీరబాబు స్వయంగా తీసుకొచ్చి సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇనుకోటి బాపన్నదొర, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను వివరిస్తున్న సుంకర వీరబాబు

పదవ తరగతి మార్క్స్‌లిస్ట్ పోయినది

చాగల్లు మండలం, కలవలపల్లి గ్రామ కాపురస్తురాలు, **నల్లూరి జయశ్రీ తండ్రి: హనుమంతరావు** అను నాయొక్క పదవ తరగతి ఒరిజినల్ మార్క్స్ లిస్ట్ ది.03-05-2025వ తేదీన మార్క్స్‌లిస్ట్‌ను జిరాక్స్ తీయించుకొని వెళుచుండగా నిడదవోలు దారి మార్గంలో పడిపోయినది. కావున ఎవరికైనా దొరికినచో నాకు అందజేయగలరు.

నల్లూరి జయశ్రీ తండ్రి: హనుమంతరావు

ఫోన్: 8142227387